క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

వేలేరు : ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ద్వారానే ఎస్సీ ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాదిగ, ఉపకులాలకు ఇచ్చిన హామీ మేరకు వచ్చేనెల 27 వరకు వర్గీకరణ అమల్లోకి తెవాలని, లేనిపక్షంలో ఎస్సీ వర్గీకరణను ఒప్పుకోని నాయకులకు రాజకీయ సమాధి చేస్తామని హెచ్చరించారు.

గుడుంబా స్వాధీనం

ఆత్మకూరు : మండల కేంద్రంలో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న మహిళను పట్టుకున్నట్లు స్థానిక పోలీస్‌లు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన శశిరేఖ గుడుంబా విక్రయిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై సర్వే

శాయంపేట : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ ఫణిచంద్ర శుక్రవారం పర్యవేక్షించారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం 1,869 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. ఫోటో క్యాప్చరింగ్ చేస్తూ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని పంచాయతీ కార్యదర్శి రత్నాకర్‌ను ఆయన ఆదేశించారు.

రజక సంఘం అధ్యక్షుడిగా చంద్రమౌళి

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక రజక సంఘం నూతన గ్రామకమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పైండ్ల చంద్రమౌళి, ఉపాధ్యక్షుడిగా వైనాల మొగిలి, ప్రధాన కార్యదర్శిగా పైండ్ల శ్రీనివాస్, కోశాధికారిగా వావిళ్ల తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా భానుచందర్, శంకరయ్య, లక్ష్మీపతి, కుమారస్వామి, నరేందర్, రాజు, అమర్, అమర్నాథ్, రజనీకాంత్, తిరుపతి, భిక్షపతిని ఎన్నుకున్నారు.

బెల్ట్‌షాపులను మూసివేయాలి

శాయంపేట : గ్రామాల్లో విచ్చలవిడిగా వెలసిన బెల్ట్‌షాపులను మూసివేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించని వైన్‌షాపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైన్స్‌షాపు నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పాడి అక్రమ దందాకు తెరలేపారని ఆరోపించారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అభివర్ధన్, ఖలీల్, మహేందర్, విక్రమ్ విజయ్, అజయ్, సౌమిత్ పాల్గొన్నారు.

టీఎన్జీవీఏ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్



దామెర : టీఎన్జీవీఏ (తెలంగాణ నాన్ గెజిటెడ్ పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల సంఘం) జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి దామెర వీఎల్ఓ గంధం లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగుల సమావేశం అనంతరం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ఏఎన్‌జీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆకుల రాజేందర్, బైరి సోమన్న, టీఎన్జీవీఏ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

శాయంపేట / దామెర : శాయంపేట, కొప్పుల, గట్లకానిపర్తి గ్రామాలతో పాటు దామెర మండలంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈలు చందూలాల్, రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

దాడిచేశారని ఫిర్యాదు

ఆత్మకూరు : తమపై దాడిచేశారని అక్కంపేటకు చెందిన పెండ్లి మంజుల శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. అక్కంపేటకు చెందిన ఎరుకల కవిత-కుమార్ దంపతుల కుమార్తెను అదే గ్రామానికి చెందిన ముస్కు నితీష్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో పవన్‌కు తెలియకుండా నితీష్ ఏసీ కొనుగోలు చేసే సమయంలో పవన్ పేరు ష్యూరిటీగా పెట్టాలని అడుగగా తన కుమార్తె వివాహానికి నా కుమారుడు పవన్ సహకరించాడని మనసులో పెట్టుకొని శుక్రవారం నితీష్ అత్తమామలు ఇంట్లోకి వచ్చి కర్రలతో దాడి చేశారని ఫిర్యాదు పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భౌభౌతో భయం భయం

- దాడులకు తెగబడుతున్న కుక్కలు
- రోడ్డెక్కాలంటే జంకుతున్న స్థానికులు
- రోడ్లకిరువైపులా చికెన్‌వ్యర్థాలు పడేస్తున్న వ్యాపారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మున్సిపల్ కార్యాలయం, సీఎస్ఐ కాలనీ రోడ్డులో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు



వీధి కుక్కల దాడిలో గాయపడి సివిల్ ఆసుపత్రికి వెళ్తున్న బాధితులు (ఫైల్)

పరకాల : చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి అలవాటుగా మారుతోందనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. చిన్నారులు, పట్టణ ప్రజలపై వీధి కుక్కలు దాడులు చేసినరోజే హడావుడి చేయడం తప్పా ముందుస్తు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. వీధి కుక్కల దాడులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీంతో సంబంధిత శాఖ రెండు, మూడు రోజులు కుక్కలను పట్టినట్లే చేసి చేతులుదులుపుకొన్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరకాల సివిల్ ఆసుపత్రికి రోజుకు రెండు, మూడు వీధి కుక్కల దాడిలో గాయపడ్డ కేసులు రావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

మున్సిపల్ బడ్జెట్‌లో రూ. 2లక్షల నిధులు

కోతులతో పాటు వీధి కుక్కలు పట్టేందుకు పరకాల మున్సిపాలిటీ ప్రతి ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో లక్షలాది రుపాయాలు వెచ్చిస్తోంది. 2024 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కూడా రూ.2లక్షల నిధులు కేటాయించింది. రాష్ట్రంలో మూడు చోట్ల చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేయడంతో వారం రోజుల పాటు వీధి కుక్కలను పట్టినట్లు చేసి ఆ తర్వాత ముఖం చాటేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డుకిరువైపులా చికెన్, మటన్ వ్యర్థాలు

పరకాల కూరగాయాల మార్కెట్ సమీపంలోని చికెన్, మటన్ దుకాణాదారులు వ్యర్థాలను రోడ్డుకిరువైపులా పడేయడంతో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. వందలాది కుక్కలు సంచరిస్తూ స్థానికులపై దాడులు చేస్తున్నాయి.

వ్యాపారులపై చర్య తీసుకోవాలి



బంధం రోడ్డులో చికెన్, మటన్ దుకాణదారులు కోళ్ల, మేకల వ్యర్థాలు పడేయడంతో వందలాది కుక్కలు అక్కడే మకాం వేసి ఉంటున్నాయి. ఆయా రోడ్డు మార్గాన వెళ్లేవారిపై, పశువులపై దాడులు చేస్తున్నాయి. సమీపంలోని మమత నగర్‌లోకి చేరుకుంటూ దాడులకు తెగబడుతున్నాయి. దీంతో చిన్నారులను భయటకు పంపాలంటే భయపడాల్సి వస్తుంది.

- రాజేందర్, అధ్యాపకుడు, మమతనగర్

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న సౌమ్య

దామెర : పత్తిసాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య అన్నారు. మండల కేంద్రంలో పీవీ నర్సింహరావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు వారి ఆధ్వర్యంలో కేంద్రీయ పత్తి పరిశోధన స్థానం సమన్వయంతో జాతీయ భద్రత పథకంలో భాగంగా పత్తి పంట సేద్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పంటను సాగుచేయాలని అన్నారు. తద్వారా కూలీల ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడి వస్తుందని అన్నారు. దీంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని వెల్లడించారు. అధిక సాంద్రతతో సాగుచేయడం ద్వారా గులాబీ రంగు పురుగును నివారించవచ్చని అన్నారు. అధిక సాంద్రతతో పంటకాలం తగ్గి త్వరగా పంటను తీసి వేరే పంటలు సాగు చేసేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. జాతీయ ఆహార భద్రత కన్సల్టెంట్ సారంగం, ఏడీఏ మాధవి, సస్య రక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ రాజు, ఏఓ రాకేష్, ఏఈఓ రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ క్రీడలు

- మండల ప్రత్యేకాధికారి మల్లయ్య



సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తున్న అధికారులు

వేలేరు : గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకే సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించినట్లు మండల ప్రత్యేకాధికారి మల్లయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సీఎం కప్ విజేతలకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలోనే జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ క్రీడాల్లో కూడా వేలేరు విద్యార్థులు రాణించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోమి, ఎంపీఓ విమల, ట్రైనీ ఎస్సై అర్చన, ఎంఈఓ చంద్రమౌళి, హెచ్ఎం రాజన్న, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి రాజేశ్వరి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి సద్దాం హుస్సేన్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలించాలి

- ఏహెచ్‌టీయూ సీఐ వెంకన్న



బాల్యవివాహల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న వెంకన్న

ఎల్కతుర్తి : బాల్య వివాహాలను నిర్మూలించాలని మానవహక్కుల రవాణా నిరోధక విభాగం(ఏహెచ్‌టీయూ) సీఐ వెంకన్న అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో శుక్రవారం ఏకేవీఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు బాల్యవివాహాల నిర్మూలన, చైల్డ్ ట్రాఫికింగ్, చైల్డ్ లేబర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాల వలన కలిగే ఇబ్బందులు, నష్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై భాగ్యలక్ష్మి, రామారావు, సుశీల, మానస, స్వర్ణలత, జగన్, గాయత్రి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

వేలేరు : ఓ వ్యక్తి తన విధులకు ఆటకం కగిలించాడని పంచాయతీ కార్యదర్శి ఎస్.వెంకటేష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. మల్లికుదుర్ల గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులకు సంబంధించిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తుండగా రాకేష్‌రెడ్డి అనే యువకుడు తనపై దురుసుగా ప్రవర్తిస్తూ, నువ్వు గ్రామంలో ఎలా పనిచేస్తావో చూస్తానని బెదిరింపులకు పాల్పడుతూ దాడికి ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

కమలాపూర్ : మండలంలోని ఓ గ్రామానికి చెందిన డిగ్రీ పూర్తిచేసిన యువతి (22) శుక్రవారం అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి డిగ్రీ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటోంది. శుక్రవారం ఉదయం యువతి కుటుంబ సభ్యులు పనికి వెళ్లి మధ్యాహ్న సమయంలో ఇంటికి వచ్చేసరికి యువతి ఇంట్లో కనిపించలేదు. దీంతో సదరు యువతి కోసం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారిని, తెలిసిన వారిని ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

దామెర : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాదారపు కిరణ్ (40) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా కొన్ని సంవత్సరాలుగా భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థాల కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరులేని సమయంలో కిరణ్ ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కారణాలు తెలియాల్సి ఉంది.

పాల దిగుబడి పెంచేందుకు కృషి

- డాక్టర్ రఘుబాబు



మూగజీవాలకు చికిత్స చేస్తున్న రఘుబాబు

వేలేరు : మేలురకం దూడలను సంరక్షించి పాల దిగుబడిని పెంచేందుకు కృషి చేస్తున్నామని పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ రఘుబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దెలగూడెం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మేలుజాతి దూడల ప్రదర్శన, ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు కేవలం ఆడదూడలు పుట్టే విధంగా చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ ఉత్తమ పాడి రైతులకు బహుమతులు అందించారు. అనంతరం పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ రణధీర్‌రెడ్డి, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాజేశ్వర్ రావు, గోపాలమిత్రలు సందీప్, అయాస్, భిక్షపతి, రజాక్, అనిల్ పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత

- సర్వోదయ సంస్థ జెండర్ ఎక్స్‌పర్ట్ ఇందిర



మాట్లాడుతున్న ఇందిర

కమలాపూర్ : ఆడపిల్లలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సర్వోదయ సంస్థ జెండర్ ఎక్స్‌పర్ట్ ఇందిర అన్నారు. మండలంలోని అంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లలకు ఇబ్బంది కలిగినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. చిన్నారులు, ఆడపిల్లలు, విద్యార్థినుల కోసం పనిచేసే, సహకారం అందించే సంస్థల గురించి వివరించారు. అనంతరం హెచ్ఎం రోజారమణి మాట్లాడుతూ.. చదువుతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. అనంతరం 'పిల్లలు, ఆడపిల్లలు, విద్యార్థినుల భవిష్యత్‌కు ఇబ్బంది కలిగించే పరిస్థితి ఏమిటి?' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎఫ్ఏ రవీందర్, సీసీ శ్రీలత, ఉపాధ్యాయులు లక్ష్మి, స్వరూపరాణి, శ్రీనివాసాచారి, నరసింహారెడ్డి, స్వప్న పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి

- రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గురుప్రసాద్



దామెర : నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

దామెర : నూతనంగా నియామకమైన బూత్ అధ్యక్షులు బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మండల రిటర్నింగ్ అధికారి కాచం గురుప్రసాద్ కోరారు. మండలంలోని కోగిల్వాయిలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో 77వ బూత్ అధ్యక్షుడిగా చుక్క మహేందర్, 78వ బూత్ అధ్యక్షుడిగా పెరుగు స్పందనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి జితేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ ప్రేమ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు శ్రీలత, రమేశ్, వేణు, అనిల్, కుమారస్వామి, నాగరాజు, దేవేందర్, శివాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : బూత్ కమిటీ ఎన్నికలను త్వరగా పూర్తిచేయాలని బీజేపీ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి పెద్దోళ్ల గంగారెడ్డి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పూర్తిస్థాయిలో బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బూత్ కమిటీలు బూత్‌స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి నర్మెట్ట శ్రీనివాస్, మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిరంగి సంతోష్‌కుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రాజు, ప్రధానకార్యదర్శిలు ఉప్పుగళ్ల శ్రీకాంత్‌రెడ్డి, పైడి ఆచార్య, నాయకులు శ్రావణ్ కుమార్, సదానందం, ప్రదీప్‌రెడ్డి, శ్రీలత పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ముప్పు

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

ధర్మసాగర్ : కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జమిలి ఎన్నికల నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం కలిగిన భారత దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు కొనసాగుతుండడం వలన జెమిలి ఎన్నికలు అసాధ్యమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని అధిక శాతం ప్రజలను మెప్పించే విధంగా ఉండాలని, కానీ ఇబ్బందులకు గురిచేసేలా ఉండొద్దని అన్నారు. అనేక రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వం ఉంటుందో, ఏ ప్రభుత్వం కూలుతుందో తెలియని పరిస్థితి ఉంటుందని, జమిలి విధానంతో అలాంటి రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, రెండు లక్షల రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లాలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించాలని కోరారు. అదే విధంగా ఈనెల 27న నిర్వహించే సీపీఐ 99వ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని నాయకులను కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు భిక్షపతి, శంకర్ నాయక్, మల్లయ్య, వెంకటేష్, ప్రభాకర్, రత్నం, చిలుకబాబు, రాజయ్య, వెంకటయ్య, రత్తమ్మ, కొమురయ్య, దేవన్న పాల్గొన్నారు.

నిరుపేదలకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలి



ధర్మసాగర్ : దీక్ష చేస్తున్న నాయకులు



ఐనవోలు : రిలే నిరాహార దీక్షలో నాయకులు



శాయంపేట : మాట్లాడుతున్న రమేశ్

- డీఎస్పీ నాయకుడు రమేశ్

ధర్మసాగర్ : రాష్ట్రంలోని నిరుపేదలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ధర్మసమాజ్ పార్టీ నాయకుడు కోల రమేశ్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ పిలుపు మేరకు మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం 2వ రోజుకు చేరుకుంది. దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లు అనే ముఖ్యమైన ఐదు అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గందమాల సాంబరాజు, రావుల వేణుమహేందర్‌రెడ్డి, రంజిత్, జిల్లా కోశాధికారి ఏసోబు, కుమారస్వామి, ప్రవీణ్‌కుమార్, భిక్షపతి, రాజు మహరాజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా హామీ నేరవేర్చలేదని, అర్హులైన వారికి 200 గజాల స్థలంలో నాలుగు గదుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంద రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పార్టీ మండల అధ్యక్షుడు అమరేందర్ అధ్యక్షతన శుక్రవారం రిలే నిరాహార దీక్ష చేపట్టగా భూ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదాసి అబ్రహంతో కలిసి దీక్షలో కూర్చొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మైదం రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ సలీంపాషా, మండల ప్రధాన కార్యదర్శి మధు, చిరంజీవి, రామ్‌చరణ్, సదానందం పాల్గొన్నారు.

ఐనవోలు : మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. విశారధన్ మహరాజ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో నిరాహార దీక్ష చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నల్లబెల్లి చిన్నరాజు, నాగరాజు, కుమారస్వామి, రాజేందర్, సాయికృష్ణ, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా, అంబర్ విక్రయిస్తే కేసులు




పరకాల : స్వాధీనం చేసుకున్న అంబర్, గుట్కా ప్యాకెట్లతో పోలీసులు

పరకాల : గుట్కా, అంబర్ ప్యాకెట్లు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై శివకృష్ణ శుక్రవారం హెచ్చరించారు. పట్టణంలో విచ్చలవిడిగా అంబర్, గుట్కా విక్రయిస్తున్న కిరాణషాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బొడ్రాయి వద్ద కిరాణం దుకాణం నడుపుతున్న పుల్లెల సత్యనారాయణ అనే వ్యక్తి అంబర్, గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్, పోలీసులు సంయుక్తంగా దాడులు చేసినట్లు తెలిపారు. అయితే దుకాణానికి తాళం వేసి పారిపోతున్న సత్యనారాయణను అదుపులోకి తీసుకొని దుకాణంలో తనిఖీ చేయగా రూ.80వేల 160 విలువచేసే అంబర్, గుట్కా ప్యాకెట్లు లభ్యమైనట్లు తెలిపారు. దీంతో సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

శాయంపేట : గుట్కా ప్యాకెట్లు అమ్ముతున్నారనే సమాచారం మేరకు మండల కేంద్రంలోని శ్రీసాయి కిరాణంపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ దాడుల్లో రూ. 20వేల విలువచేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వాటిని పంచుల సమక్షంలో సీజ్ చేసి షాపు యాజమాని వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గురుధామంలో శివానందమూర్తి జయంతి



జయంతి వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ట్రస్టీలు

వరంగల్: వరంగల్ ములుగురోడ్డు సమీపంలోని సప్త గురుధామంలో ఈనెల 18నుంచి 20వ తేదీ వరకు సద్గురు శివానందమూర్తి 96వ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. గురుధామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18న ఉదయం భారతీయ సంస్కృతి - పరిరక్షణ వికాసం - నేటి యువత పాత్ర అనే అంశం మీద వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. 19న ఉదయం భగవద్గీతలోని రెండవ అధ్యాయం 48, 50 శ్లోకాలు, మూడో అధ్యాయం ఏడో శ్లోకం మూడింటిపై ఉచ్చరణ, తాత్పర్యం చెప్పిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. సమావేశంలో ట్రస్టీలు బండారు సాయినారాయణ, మాదారపు సదాశివుడు, గందె ఉమాశంకర్, సంపత్, రాజా మొగిలి తదితరులు పాల్గొన్నారు.

అంబాలలో చైన్ స్నాచింగ్

మహిళ మెడలోని మూడు తులాల బంగారు గొలుసు అపహరణ

కమలాపూర్ : మండలంలోని అంబాలలో గుర్తు తెలియని దుండగులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఓ మహిళ మెడలోని మూడు తులాల బంగారు గొలుసు అపహరించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. అంబాలలో శ్రీలత కిరాణం నడుపుకొంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో కిరాణానికి శుక్రవారం రాత్రి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆలుగడ్డలు కావాలని అడిగారు. శ్రీలత లేవని చెప్పడంతో థంప్సస్ కావాలని అడుగగా థంప్సస్ తీసుకొని ఆమె బయటకు రాగానే గుర్తు తెలియని దుండగులు ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాగేసుకుని వెళ్లారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. మండంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులు అనుమానితులుగా కనిపిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (హన్మకొండ)
వి. రాజేకుమార్ యాదవ్ (S.R) : 9966290903 (ఎల్కతుర్తి)
ఎం. మధు (S.R) : 8639566261 (పరకాల)
కె. సుధాకర్ రెడ్డి (A.C.O) : 9177258410 (హన్మకొండ)